క్లుప్తంగా

విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ట్రాన్స్‌కో కృషి



విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయిస్తున్న ఏఈ సుబ్బారెడ్డి

గుడ్లవల్లేరు: అకాల వర్షాలకు బలంగా వీచిన ఈదురు గాలులకు విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. రెండు రోజులుగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ట్రాన్స్‌కో ఏఈ కె.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రాత్రింబవళ్లు కృషి చేశారు. సోమవారం కూడా గుడ్లవల్లేరులో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసే పనుల్లో ట్రాన్స్‌కో సిబ్బంది నిమగ్నమయ్యారు. త్వరితగతిన ట్రాన్స్‌కో సిబ్బంది కృషి చేసి విద్యుత్‌ను పునరుద్ధరించటంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకుని హర్షం వ్యక్తం చేశారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన



మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 41వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ముగిసిన సందర్భంగా సోమవారం రాత్రి భారీ అన్నసమారాధన జరిగింది. అన్నసమారాధనలో మండవల్లి సమీప గ్రామాల నుంచి 2,500 మంది పాల్గొన్నారు. ఉదయం నుంచి గ్రామోత్సవం, రాత్రి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. గూడూరు హనుమశ్శాస్త్రి, భవాని శంకర్ అర్చకులుగా వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

23న మున్సిపల్ దుకాణాలకు వేలం

గుడివాడటౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని ఎస్‌పీఎస్ నార్త్‌బ్లాక్ మొదటి అంతస్తులో గల పురపాలక సంఘ దుకాణాల అద్దె బహిరంగ వేలం ఈనెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి అంతస్తులోని 1ఎ, 2ఎ, 16ఎ, 25ఎ, 40ఎ, 41ఎ దుకాణాల అద్దె బహిరంగ వేలం జరుగుతందన్నారు. ఆసక్తిగల వారు ఈ వేలంలో పాల్గొని దుకాణాలు దక్కించుకోవాలని ఆయన కోరారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మండవల్లి: మండలంలోని మూడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మల్లీశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17న మంజూరైన వలంటీర్ నోటిఫికేషన్ ద్వారా అయ్యవారిరుద్రవరం-2, పెనుమాకలంక-1, పుట్లచెరువులో-1 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులై, గ్రామానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బందరు సబ్ డివిజన్‌లో పోలీస్‌యాక్టు అమలు

కోనేరుసెంటర్: బందరు సబ్-డివిజన్ పరిధిలో మార్చి 20వ తేదీ నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్‌యాక్టు అమలుపరుస్తున్నట్లు బందరు డీఎస్పీ మాసూంబాషా తెలిపారు. యాక్టు అమలులో ఉండగా పోలీసుల అనుమతి లేకుండా ఏ ఒక్కరు సభలు, సమావేశాలు, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. బహిరంగ ప్రదర్శనలు, ర్యాలీలు వంటివి కూడా నిర్వహించకూడదన్నారు. అలాంటి కార్యక్రమాలు నిర్వహించదలచుకున్న వ్యక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న గ్రామోత్సవం

కోడూరు: కోడూరు ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న గంగాభవానీ అమ్మవారి గ్రామోత్సవం భక్తిప్రపత్తులతో కొనసాగుతోంది. సోమవారం కోడూరు తూర్పువైపు, స్వతంత్రపురం, ఎస్సీవాడల్లో చిన్నఅమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారి వాహనం ముందు నీటిని ఓరబోసి భక్తులు స్వాగతం పలుకుతున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలను సమర్పించి తమ భక్తిభావం చాటుతున్నారు. వీవర్స్‌కాలనీ, నరసింహపురం, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డి వారిపాలెం గ్రామాల్లో కూడా అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. 23న ప్రధాన గుడిసంబరం నిర్వహించిన అనంతరం 24న చిన్నఅమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించనున్నట్లు యుగంధరరావు చెప్పారు.

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన



పెదపాలపర్రులో ఏఓ వేణుమాధవ్‌కు దెబ్బతిన్న పైరును చూపుతున్న రైతు

ముదినేపల్లిరూరల్: మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మినుము పైరును వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పలువురు వ్యవసాయ సహాయకులు సోమవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 12,500 ఎకరాల్లో రెండో పంటగా మినుము సాగు చేశారు. ఇందులో 50 శాతానికి పైగా పంట రైతుల చేతికొచ్చింది. మిగిలిన పైరంతా తీతలు తీసి పనలపై ఉండగా, కొద్దిమేర విస్తీర్ణంలో తీతలు తీయాల్సి ఉంది. ఇలాంటి తరుణంలో గత మూడు రోజులుగా వచ్చిన అకాల వర్షాలు పంటని తీవ్రంగా దెబ్బతీశాయి. వర్షాల కారణంగా తడి ఆరకుండా ఉన్న పనలను రైతులు గుట్టలు వేసి పరదాలు కప్పి కాపాడుకున్నారు. అయినా గాలి చొరబడని కారణంగా పైరుకు బూజు పట్టి విత్తనాలు మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా పలు గ్రామాల్లో పంటకు నష్టం జరగడంతో తీవ్రంగా దెబ్బతిన్నామని వ్యవసాయాధికారి ఎదుట పెదపాలపర్రు రైతులు వాపోయారు. సోమవారం సైతం కొద్దిపాటి చినుకులు కురవడంతో పైరును గుట్టలుగానే ఉంచి పరదాలు కప్పివేశారు. దీనితో మినుములు మరింత మొలకెత్తే ప్రమాదం ఏర్పడిందని చెబుతున్నారు. తీత తీయకుండా నిలబడి ఉన్న పైరుకు పెద్దగా నష్టం ఏమి జరగలేదని వ్యవసాయాధికారి తెలిపారు. వర్షాల వల్ల దెబ్బతిన్న పంటను ఎన్యూమరేషన్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడినట్లు చెప్పారు.



మొలకెత్తుతున్న మినుములు



కైకలూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు

అకాల వర్షాలతో రహదారులు జలమయం

కైకలూరు: అకాల వర్షాలకు జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారులు నీటితో నిండాయి. కైకలూరులో సోమవారం ఉదయం 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. వర్షాలకు పలు డ్రెయిన్లు పొంగిపొర్లాయి. కైకలూరు వెలంపేట, బస్టాండ్, తాలూకా సెంటర్, టౌన్ హాలు, రైల్వే స్టేషన్, షాదిఖానా, కొత్త పెట్రోలు బంకు వద్ద వర్షపు నీరు చేరింది. పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన నీటి తొలగింపు పనులు చేపట్టారు. కొత్త పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై పడిన గుంతలలో వర్షపు నిలిచింది. ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే నాలుగు రోజులుగా వాతావరణం చల్లగా మారడంతో చెరువుల్లో ఆక్సిజన్ సమస్య వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

సమస్యల పరిష్కారానికే ‘స్పందన’

గుడివాడటౌన్: ప్రజల సమస్యలు సత్వర పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఇతర శాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమంలో సమస్యలపై అర్జీలు అందిస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. సమస్యను బట్టి నెలలోపు పరిష్కారం చూపడం లేదా పరిష్కారమార్గం తెలియజేస్తామన్నారు. వివిధ సమస్యలపై మూడు ఫిర్యాదులు అందాయన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు



ఫిర్యాదుదారుని అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి

గ్రామసభలు విజయవంతం చేయాలి

మండవల్లి: ఏప్రిల్‌లో జరిగే గ్రామ సభలను విజయవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఐక్య వేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు తెంటు అప్పారావు, ప్రధాన కార్యదర్శి కె.మార్కురాజు పేర్కొన్నారు. ఏప్రిల్ 14 నుంచి జరిగే గ్రామసభలు విజయవంతం కావడానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ జె.శ్రీనివాసరావుకు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు.

కొండలమ్మ ఆలయానికి విరాళం అందజేత

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ ఆలయానికి పమిడిముక్కల మండలం మామిడిపల్లికి చెందిన భక్తుడు డి.గోపాలకృష్ణ రూ.7,100 విరాళాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ శేషం గోపీకి సోమవారం ఈ విరాళాన్ని అందించారు. అలాగే బుధవారం ఉగాదిని పురస్కరించుకుని అమ్మ వారి సన్నిధిలో పంచాంగ శ్రవణం చేయిస్తున్నట్లు ఈఓ సురేష్ తెలిపారు. గురువారం అమ్మవారి హుండీల్లో కానుకలను లెక్కిస్తామన్నారు.

దంతాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



కైకలూరు ర్యాలీలో పాల్గొన్న అధికారులు



రోగులకు జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ రాజేశ్వరి

కైకలూరు: దంతాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కైకలూరు సీహెచ్‌సీ దంత వైద్యురాలు రమ్య సూచించారు. జాతీయ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీని సోమవారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నోటి పరిశుభ్రత, దంత సమస్యలపై అవగాహన కల్పించడానికి 2007 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. మద్యపానం, గుట్కా, ధూమపానం వంటి అలవాట్లతో దంతాలు ఎక్కువగా దెబ్బతింటున్నాయని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు తప్పనిసరిగా దంతాలను పరీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబు, వైద్యులు దుర్గాప్రసాద్, కీర్తి, అనస్థీషియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వ పీహెచ్‌సీలో..

మొవ్వ: పొగాకు, గుట్కా, ధూమపానం, మద్యపానం చేయటం వలన నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉందని డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి సూచించారు. మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎం వేదరాజ్ అధ్యక్షతన సోమవారం ప్రపంచ నోటి శుభ్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోటి పరిశుభ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు వివరించారు. అలాగే నోటి క్యాన్సర్, పలు రకాల క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ డి.శంకరరావు, కె.విజయదుర్గ, బి.విజయకుమార్, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు, సామగ్రి పంపిణీ

పామర్రు(పమిడిముక్కల): పాఠశాలలోని క్రీడాకారులకు క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రిని దాత సహకారంతో అందజేశామని పాఠశాల హెచ్‌ఎం జి.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. పమిడిముక్కల మండలం అగినపర్రు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సోమవారం క్రీడా దుస్తులు, సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. అగినపర్రు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విశ్రాంత హెచ్‌ఎం రాజాగ్లోరి యస్ జ్ఞాపకార్థం ఆమె భర్త ఎం.బాబూరావు రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రిని అందించాన్నారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దాత ఇచ్చిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

బహుజన సాహిత్య అకాడమీ పోస్టర్ ఆవిష్కరణ

పామర్రు(పమిడిముక్కల): సమాజ వికాసానికి దోహదపడే కళా సాంస్కృతిక సాహిత్య రంగాల్లో బహుజనుల ప్రతిభ పాఠకులకు మరింత గుర్తింపు ప్రోత్సాహం అవసరమని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న ఉయ్యూరులో తలపెట్టిన బీఎస్ఏ నేషన్ అవార్డ్స్-2023 కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ స్థాయిలో చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ జ్ఞాన దినోత్సవం సందర్భంగా ఉయ్యూరు బైపాస్ రోడ్డులోని గ్రీన్ ల్యాండ్ రిసార్ట్స్ ఆవరణలో కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు, బీసీ హక్కుల ఉద్యమ నిర్మాత ఆర్.కృష్ణయ్యతో పాటు పలువురు రాజకీయ, వివిధ రంగాల ప్రముఖులు హాజరు అవుతారని చెప్పారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ నేతృత్వంలో బీఎస్ఏ ఆంధ్రప్రదేశ్ విభాగం అధ్యక్షుడు జంపాన శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు జంపాని శ్రీనివాస్‌గౌడ్, ప్రతినిధులు కె.సురేష్, కాటూరి గౌతమి, కోలా దుర్గా భవాని, నారగాని రజని పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆఫ్ చల్లపల్లి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించిన ఈ శిబిరంలో హోమియో వైద్యులు డాక్టర్ మణికంఠ 150 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. క్లబ్ అధ్యక్షుడు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, దింటకుర్తి జ్యోతి, కుసుమ, నేహా శిబిరాన్ని పర్యవేక్షించారు.

శ్రీరామ పాదయాత్రకు ఘన స్వాగతం

పామర్రు: భద్రాచలంలో ఈనెల 30వ తేదీన జరిగే శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పామర్రు మండలం జుఝవరం గ్రామం నుంచి 45 మంది శ్రీరామ పాదయాత్రగా కాలినడకన భద్రాచలంకు సోమవారం బయలు దేరారు. జై శ్రీరామం అంటూ నినాదాలు చేస్తూ గత 15 ఏళ్లుగా ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నారు. జుఝవరం గ్రామానికి చెందిన పాదయాత్ర బృందం ప్రతినిధులు కాగిత బ్రహ్మయ్య, గొరిపర్తి రత్తాలు, కొలుసు నారాయణ, ఆకునూరి వీర కుమారి, ఎంపీటీసీ పసుపులేటి నాగ నాంచారమ్మ, బోసిన నాగ శ్రీనివాసరావు, కొండేటి గణపతి, వీరంకి చెన్నకేశవులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పామర్రు మండలం పెదమద్దాలి శివారు కొత్తపెదమద్దాలి గ్రామంలో ఉన్న శ్రీరామాజంనేయస్వామి ఆలయం వద్ద పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు నూతలపాటి త్రివిక్రమరావు సౌజన్యంతో పాదయాత్రలో పాల్గొన్న వారికి స్వాగతం పలికి ఆతిథ్యం ఇచ్చారు. ఆలయ అర్చకులు రొంపిచర్ల కోదండపాణి భార్గవ అప్పలాచార్యులు పాదయాత్ర చేసే భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమం కళా పరిషత్ అధ్యక్షుడు ఎన్.త్రివిక్రమరావు, పరిషత్ గౌరవ అధ్యక్షుడు పీఎంఎస్‌ప్రసాద్, ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్ మేనేజర్ ఘంటసాల వెంకటేష్, కళా పరిషత్ ప్రతినిధులు" సత్యనారాయణరాజు, పసుపులేటి నర్సింహారావు, ఈడే కృష్ణ, ఎండీ ఆయూబ్, వత్తిపల్లి కిరణ్‌లు పాల్గొని పాదయాత్రలో పాల్గొని కొద్ది దూరం వారితో నడిచారు.



పాదయాత్రలో పాల్గొన్న కళాపరిషత్ సభ్యులు

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

గుడివాడటౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలో జగనన్న కాలనీల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో సోమవారం సాయంత్రం లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్ల నిర్మాణానికి కావలసిన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో పాటు కో-ఆపరేటివ్ బ్యాంక్ నుంచి రూ.50 వేలు, డ్వాక్రా సంఘాల నుంచి రూ.50 వేలు, ఉచిత ఇసుక, సబ్సిడీ ఐరన్, సిమెంట్‌తో పాటు భవన నిర్మాణానికి కావలసిన ఇతర సామగ్రిని ఉచితంగా అందజేస్తుందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకుని ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రామోజీనాయక్, ఏఈ సుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు, వార్డు సచివాలయ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

పామర్రు(పమిడిముక్కల): తన వద్దకు వచ్చిన రైతుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షులు ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు. పమిడిముక్కల మండలం కూడేరు గ్రామంలో ఓ కార్యక్రమానికి సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు సమస్యలపై నాగిరెడ్డికి అర్జీని అందజేశారు. రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా విక్రయించిన ధాన్యం నగదు జమ కాలేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీని సమర్పించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగే విధంగా తగు విధమైన చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీల ప్రజావేదిక



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రజావేదిక సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగింది. ఏపీడీ శ్రీలత, జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజావేదికలో పలు అంశాలపై చర్చ జరిగినట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా రోజువారీ పని పంచాయతీరాజ్, సర్వశిక్ష అభియాన్, గ్రామీణ నీటి పారుదల, ఇతర అంశాలపై 23 గ్రామాలకు చెందిన ఉపాధిహామీ పనులకు సంబంధించి విశ్లేషణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులకు సంబంధించి పంచాయితీరాజ్ విభాగంలో రూ.6 వేలు, ఉపాధి హామీ పనుల్లో రూ.1,19,681 రికవరీగా గుర్తించామని, ఉపాధి హామీ పనులకు చెల్లించాల్సిన మొత్తం రూ 10,697గా గుర్తించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీలు పూడి సుధాకరరావు, కొప్పుల జయరాజు, అసిస్టెంట్ ఇంజనీర్ రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రూపేష్, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, నాయకులు కందుల నాగరాజు, సరెళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలి



కోటిరెడ్డిపేటలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భానుశ్రీ

పామర్రు: చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలుసుకుని ప్రతి ఒక్కరూ ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ వి.భానుశ్రీ తెలిపారు. స్థానిక కోటిరెడ్డిపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడాపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ.. మార్చి 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శరీర ధృడత్వానికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. లైట్ ద ల్యాంప్ వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం



సాయినాథునికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీవిజయ దత్త షిరిడీ సాయినాథుని మందిర 12వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు తుర్లపాటి వెంకట ప్రభాకర్ ఆధ్వర్యంలో సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు జరపటంతో పాటు భజనలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నసమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

నేటి ఎమ్మెల్యే డీఎన్నార్ కార్యక్రమాలు

కైకలూరు: స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) మంగళవారం నియోజకవర్గంలో పర్యటన వివరాలు ఆయన కార్యాలయ సిబ్బంది సోమవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు ఏలూరు రోడ్డు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం జరుగుతుందన్నారు. అనంతరం కలిదిండి మండలం కాళ్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలమోరు మంచినీటి సరఫరా పంప్ హౌస్ ప్రారంభం, అనంతరం అక్కడే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి కలిదిండి మండలం కాళ్లపాలెం గ్రామంలో 191వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఉదయం 11.30 గంటలకు కైకలూరు మండలం భుజబలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ఈ నెల 25న దెందులూరు సీఎం జగన్ రానున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిమిత్తం జిల్లా కలెక్టర్ దెందులూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు.